# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 301 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 10 అక్టోబర్ 2026 | పేజీ : 04




ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించాలి
- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

3



2 లో

## ప్రజాస్వామ్య పరిరక్షణలో
# జర్నలిస్టుల పాత్ర కీలకం

- అయోధ్యలో ముగిసిన ఎన్‌యూజే-ఐ జాతీయ మండలి ద్వివిన సమావేశం
- పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణకు పలు తీర్మానాలు



## బడుల్లో ముందస్తు
## బతుకమ్మ వేడుకలు

4లో

## జనగామ డిపోలో ఎన్ఎంయూ విజయం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ ఆర్టీసీ డిపో కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతిచ్చిన టీజీఎస్ఆర్టీసీ ఎన్ఎంయూ 59 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. రాష్ట్రస్థాయిలో ఎంప్లాయిస్ యూనియన్ 100 ఓట్ల మెజారిటీ సాధించినట్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జనగామలో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కార్మికులకు, యూనియన్ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.






# ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- అయోధ్యలో ముగిసిన ఎన్‌యూజే-ఐ జాతీయ మండలి ద్విదిన సమావేశం
- పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణకు పలు తీర్మానాలు



**అయోధ్య, మన చౌరాస్తా :** ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి భూపేంద్ర చౌధరి అన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడంతోపాటు ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేయడంలో మీడియా విశేష పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రజల్లో నేటికీ అత్యంత విశ్వసనీయమైన వ్యవస్థగా మీడియా నిలుస్తోందని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ అధ్యక్షుడు సురేశ్ శర్మ అన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ మండలి ద్విదిన సమావేశాలు అయోధ్యలోని హనుమాన్ బాగ్ ఆశ్రమంలో ఘనంగా ముగిశాయి. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది పాత్రికేయ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పాత్రికేయుల హక్కులు, సంక్షేమం, భద్రత, మీడియా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. సమావేశాన్ని ప్రారంభించిన మంత్రి భూపేంద్ర చౌధరి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి మీడియా రక్షణ కవచంలాంటిదని, సమాజానికి వాస్తవాలను తెలియజేస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తుందని పేర్కొన్నారు. రాజకీయాల కంటే పాత్రికేయ రంగంపై ప్రజల్లో ఎక్కువ విశ్వాసం ఉందని అభిప్రాయపడ్డారు. డిజిటల్, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముద్రిత మాధ్యమాల బాధ్యత మరింత పెరిగిందన్నారు. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ముద్రిత మాధ్యమ రంగాన్ని ఆదరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన మంత్రి, అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం, కాశీలో విశ్వనాథ ఆలయ ప్రాంగణ అభివృద్ధి, వింధ్యాచల్ దేవాలయ ప్రాంత అభివృద్ధి వంటి కార్యక్రమాలు ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలకు ఊతమిచ్చాయని పేర్కొన్నారు. శ్రీరామ మందిర నిర్మాణ ఉద్యమంలో పాత్రికేయులు, మీడియా కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పాత్రికేయుల సంక్షేమానికి సంబంధించి సమావేశంలో ప్రస్తావించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పాత్రికేయుల పింఛను, గౌరవ భృతి పథకాల అంశాన్ని కూడా పరిశీలించాలని కోరుతానని తెలిపారు.

**ప్రజల్లో మీడియాపై విశ్వాసం నిలబెట్టాలి**

ఎన్‌యూజే-ఐ జాతీయ అధ్యక్షుడు సురేశ్ శర్మ మాట్లాడుతూ, దేశంలోని 24 రాష్ట్రాల్లో తమ సంఘం కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశానికి 22 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ముద్రిత మాధ్యమాలు ఇప్పటికీ విశేష సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. వాస్తవాలు, ఆధారాలు, నిజాయితీతో కూడిన కథనాలే మీడియాపై ప్రజల విశ్వాసాన్ని నిలబెడతాయని అన్నారు. పాత్రికేయ విలువలు, వృత్తిపరమైన ప్రమాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాలను పాత్రికేయ వృత్తితో సమానంగా పరిగణించడం వల్ల మీడియా విశ్వసనీయతపై ప్రభావం పడుతోందని అభిప్రాయపడ్డారు. ఇతర సంస్థలు వివాదాల్లో చిక్కుకున్నప్పటికీ, ఎన్‌యూజే-ఐ పాత్రికేయుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారిస్తోందని తెలిపారు.

**పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు తీర్మానాలు**

సమావేశంలో పాత్రికేయుల ప్రయోజనాల పరిరక్షణకు పలు ముఖ్యమైన తీర్మానాలను ఆమోదించారు. వాటిలో ప్రధానంగా పాత్రికేయుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. పాత్రికేయులకు వేతన బోర్డును ఏర్పాటు చేసి, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలి. ప్రస్తుత పత్రికా మండలి స్థానంలో విస్తృత అధికారాలతో మీడియా మండలిని ఏర్పాటు చేయాలి. మీడియా రంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ముద్రిత మాధ్యమాలకు సంబంధించిన ప్రకటనల విధానంలో వివక్షను తొలగించి, సమాన అవకాశాలు కల్పించాలి. పాత్రికేయుల పింఛను, గౌరవ భృతి, సంక్షేమ పథకాలను విస్తరించాలి. ప్రజాస్వామ్యంలో మీడియా తన పాత్రను సమీక్షించుకుంటూ, వృత్తిపరమైన విలువలను కాపాడుకోవాలి. పాత్రికేయులకు అత్యధిక ఉపాధి కల్పిస్తున్న ముద్రిత మాధ్యమాల పట్ల ప్రభుత్వాలు మరింత ఉదారంగా వ్యవహరించాలని ప్రతినిధులు కోరారు. ఉద్యోగులకు వేతన సంఘం ఏర్పాటు చేసినప్పటికీ, పాత్రికేయుల వేతన బోర్డు డిమాండ్ ఇంకా పెండింగ్‌లో ఉండటంపై సమావేశం అసంతృప్తి వ్యక్తం చేసింది. పాత్రికేయ రంగంలో భవిష్యత్తు తరాలకు మెరుగైన వాతావరణాన్ని కల్పించేందుకు మీడియా తన బాధ్యతలను సమీక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అయోధ్య నగర ఎమ్మెల్యే వేదప్రకాశ్ గుప్తా మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో అయోధ్యను ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందన్నారు. శ్రీరామ మందిర నిర్మాణంతో పాటు నగర అభివృద్ధిలో పాత్రికేయులు, మీడియా ప్రజలను చైతన్యవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అయోధ్య జిల్లా కలెక్టర్ శశాంక్ త్రిపాఠి సమావేశానికి హాజరై జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, శ్రీరామ మందిర దర్శన ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాత్రికేయుల పాత్రను ప్రశంసిస్తూ, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో మీడియా సహకారం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. దేశవ్యాప్తంగా అయోధ్యకు సంబంధించిన సానుకూల సమాచారాన్ని ప్రజలకు అందించాలని కోరారు. సమావేశంలో ఎన్‌యూజే-ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియుగ్ నారాయణ్ తివారీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం పాత్రికేయుల స్థితిగతులను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. హనుమాన్ బాగ్ ఆశ్రమ మహంత్ జగదీశ్ దాస్ మహారాజ్ సమావేశ నిర్వహణకు అందించిన సహకారాన్ని సంఘం నాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ముగింపు సమావేశంలో సంఘం మాజీ అధ్యక్షుడు అశోక్ మాలిక్ మాట్లాడుతూ, పరస్పర సహకారం, విశ్వాసంతో పాత్రికేయుల హక్కుల సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎన్‌యూజే-ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఉమేశ్ చతుర్వేది, కవితా రాజ్, బడే ప్రభాకర్, కార్యదర్శులు అదీప్ సోనీ, భవానీ జోషి, సంఘటనా కార్యదర్శి పురుషోత్తమ్ నాగరోనీ, రాజీవ్ శుక్లా తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సర్వేశ్ కుమార్ సింగ్ (ఉత్తరప్రదేశ్), రవీంద్ర వాజ్‌పేయి (మధ్యప్రదేశ్), రాకేశ్ ప్రవీర్ (బిహార్), కైలాష్ నాయక్ (ఒడిశా), హర్జిందర్ సింగ్ లాల్ (పంజాబ్), దీపక్ వశిష్ఠ్ (చండీగఢ్), బల్దేవ్ శర్మ (ఝార్ఖండ్), టి. అనిల్ కుమార్ (తెలంగాణ), సంభాద్రి కృష్ణ (ఆంధ్రప్రదేశ్), శ్యామ్ మారూ (రాజస్థాన్), బీర్బల్ శర్మ, బల్బీర్ ఠాకూర్ (హిమాచల్‌ప్రదేశ్), బల్జీత్ సింగ్ (హర్యానా), కవీంద్ర సింగ్ (ఢిల్లీ) తదితరులు తమ రాష్ట్రాల్లో పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పాత్రికేయుల ఐక్యతను బలోపేతం చేస్తూ, వారి హక్కులు, భద్రత, సంక్షేమం కోసం సమష్టిగా పోరాడాలని జాతీయ మండలి సమావేశం పిలుపునిచ్చింది.









# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షల శిబిరం

**జనగామ, మన చౌరాస్తా :** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320F రీజియన్ 6 ఆధ్వర్యంలో 'విజన్ అవేర్‌నెస్ మంత్' (Vision Awareness Month) పురస్కరించుకుని చేపట్టిన ఉచిత కంటి పరీక్షల శిబిరాలను శుక్రవారం జనగామలోని ఆయుష్మాన్ హాస్పిటల్‌లో ఘనంగా ప్రారంభించారు. రీజియన్ చైర్మన్ లయన్ జైన రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పూర్వ జిల్లా గవర్నర్, రీజన్ అడ్వైజర్ లయన్ కన్నా పరశురాములు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. అక్టోబర్ నెలాఖరు వరకు జనగామ పట్టణం మరియు పరిసర గ్రామాల్లో వరుసగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సుమారు 500 నుండి 600 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, క్యాటరాక్ట్ (కంటి శుక్లాలు) ఉన్నట్లు గుర్తించిన బాధితులకు హనుమకొండలోని ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రీజియన్ 6 పరిధిలోని లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ, ఆబాద్, సూర్య, BBoys క్లబ్‌ల ప్రతినిధులు, లయన్స్ నాయకులు ఎడమ సంజీవ రెడ్డి, తీరుపల్లి కృష్ణారెడ్డి, కృష్ణజీవన్ బజాజ్, రవి నాయక్, కన్నా శ్రీనివాస్, రేణికుంట కృష్ణ, నాగంపల్లి శ్రీనివాస్, పానుగంటి యాదగిరి, బాల్దే మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# జనగామ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పురపాలక సంఘ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ అధ్యక్షతన 8వ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 34 ఎజెండా అంశాలను ప్రవేశపెట్టగా, అందులో 19 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మిగిలిన 15 అంశాలను వాయిదా వేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. రాజశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ పర్వతాలు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ విజ్ఞాన వ్యాప్తిలో జేవీవీ కృషి అభినందనీయం

**జనగామ, మన చౌరాస్తా :** సమాజంలో మూఢనమ్మకాలను పారద్రోలి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో జనవిజ్ఞాన వేదిక (JVV) కృషి అభినందనీయమని విశ్రాంత కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి అన్నారు. జనగామలో నిర్వహించిన JVV 6వ జిల్లా మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్. బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా జి. కనకయ్య, కోశాధికారిగా ఎం. లక్ష్మణ్ జీ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ గోపాల్ రెడ్డి, డాక్టర్ మనస్విని, డాక్టర్ మాచర్ల భిక్షపతి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు, కార్యదర్శులను సైతం ఎన్నుకున్నారు.



# వర్షా భావ పరిస్థితులపై క్షేత్రస్థాయి నివేదికలు సిద్ధం చేయాలి

**సీఎస్ సంజయ్ జాజు**



**హైదరాబాద్/జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో పంట నష్టాలు, భూగర్భ జలాలు, తాగునీరు మరియు విద్యుత్ సరఫరాపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష నిర్వహించారు. జనగామ సమీకృత కలెక్టరేట్ నుండి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రధానాంశాలు

**కరువు మండలాల గుర్తింపు :** రాష్ట్రంలో 17 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉందని, 320 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. 20 శాతం కంటే ఎక్కువ వర్షపాతం లోటు ఉన్న మండలాలను గుర్తించి నివేదికలు అందించాలన్నారు.

**ముఖ్యమంత్రి సమీక్ష (అక్టోబర్ 12) :** వర్షాభావ పరిస్థితులు, రైతుల సమస్యలపై సీఎం ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 12న మంత్రులు, రైతులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ఉపాధి హామీ పనుల విస్తరణ :** కరువు పరిస్థితుల దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను పెంచి ప్రతి గ్రామంలో కూలీలకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు.

**జల సంరక్షణ చర్యలు :** ఫార్మ్ పాండ్స్ నిర్మాణం, చెరువుల పూడికతీత, ఇంకుడు గుంతల ఏర్పాటును వేగవంతం చేయాలని మరియు బోరుబావుల రీచార్జ్ పనులను అక్టోబర్ 25 నాటికి పూర్తి చేయాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. వర్షపాతం, సాగునీరు, విద్యుత్ వినియోగం మరియు నేల తేమ వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో బలరామ రావు, డీఏఓ అంబికా సోనీ తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి సోమన్న ఆదాయం రూ.21.98 లక్షలు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.21,98,507 ఆదాయం సమకూరినట్లు ఈఓ భాగం లక్ష్మీ ప్రసన్న తెలిపారు. మార్చి 24 నుంచి అక్టోబర్ 9 వరకు భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. 5.580 గ్రాముల మిశ్రమ బంగారం, 1.359 కిలోల వెండితో పాటు విదేశీ కరెన్సీ లభించినట్లు పేర్కొన్నారు.





# తరిగొప్పుల తహసీల్దార్ తీరుపై సర్పంచుల ఆగ్రహం

**తరిగొప్పుల, మన చౌరాస్తా :** తరిగొప్పుల మండల సర్వసభ్య సమావేశంలో పలు ప్రజాసమస్యలు, సీసీ రోడ్ల నిర్మాణ నిబంధనలపై సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో తహసీల్దార్ మోసిన్ రైతులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని బత్తలపల్లె సర్పంచ్ రవి నాయక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణం కోసం మట్టి (మొరం) తోలడానికి డీడీ కట్టాలనడంపై బొంతగట్టు నాగారం సర్పంచ్ కుర్ర మల్లయ్య ప్రభుత్వాన్ని నిలదీశారు. రోడ్డు నిలకడగా, దృఢంగా ఉండాలంటే మొరం వేయడం తప్పనిసరి అని, దానికి సంబంధించిన డబ్బులు సర్పంచులు తమ సొంత జేబుల్లోంచి పెట్టుకోవాలా అని ప్రశ్నించారు. సీసీ రోడ్ల నిర్మాణ ఆర్డర్ కాపీలోనే మొరం, మట్టికి సంబంధించిన బిల్లును కూడా చేర్చాలని సర్పంచులు డిమాండ్ చేశారు.





# విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించాలి

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, మానసిక శ్రేయస్సుపై అవగాహన కల్పించేందుకు పాఠశాల ఆరోగ్య, శ్రేయస్సు కార్యక్రమాన్ని (SHWP) సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కార్యక్రమ అమలు తీరుపై సమావేశం నిర్వహించి, సమీక్షించారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని మరో 21 జిల్లాలకు విస్తరించగా, అందులో జనగామ జిల్లా కూడా ఉందన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసి, శిక్షణ అనంతరం హెల్త్ అండ్ వెల్నెస్ (ఆరోగ్యం, శ్రేయస్సు) అంబాసిడర్లుగా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. ప్రతి వారం ఒక గంట పాటు విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మంగళవారాన్ని ఆరోగ్యం, శ్రేయస్సు డేగా నిర్వహించి, నిర్దేశించిన 11 అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు, కౌమార ఆరోగ్య క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. యోగా, ధ్యానం, సురక్షిత తాగునీరు, రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ మేరకు నిర్వహించిన కార్యక్రమ వివరాలను SHWP MIS మొబైల్ యాప్ లో నమోదు చేసి, నివేదికలను సమర్పించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ, విద్యార్థులకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఆరోగ్య సమస్యలున్న విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చూడటం, కార్యక్రమ అమలును పర్యవేక్షించడం ద్వారా పాఠశాలల్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎంహెచ్ఓ వాణిశ్రీ, జీసీడీఓ గౌసియా బేగం, అన్ని మండలాల ఎంఈఓలు, ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.





# జనగామ జిల్లా జర్నలిస్టుకు సత్కారం

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన పీపుల్ మీడియా పాయింట్ రెండో వార్షికోత్సవ వేడుకల్లో 6TV జనగామ జిల్లా రిపోర్టర్ తిప్పారపు ఉపేందర్ పురస్కారం2026 అందుకున్నారు. జర్నలిజం రంగంలో ఆయన అందిస్తున్న విశేష సేవలను గుర్తించి నిర్వాహకులు ఈ అవార్డును అందజేసి, శాలువాతో సత్కరించారు. పీపుల్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు మాజీ మంత్రి బాబు మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు మరియు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.




# గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను జనగామలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం రంగురంగుల పూల బతుకమ్మలతో కళకళలాడగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బతుకమ్మల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు, పాల్గొన్న వారికి యాజమాన్యం తరఫున బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ మోతే సురేందర్ రెడ్డి మరియు ప్రిన్సిపాల్ ఎం.డి. అహమ్మద్ పాషా మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యతో పాటు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఐకమత్యం, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఈ సందర్భంగా యాజమాన్యం ధన్యవాదాలు తెలిపింది.





# ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ చిట్ల రాజేందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేస్తూ పండుగ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా చాటి చెప్పారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఈదులకంటి రాజు, అనిల్, కిషన్, వినయ్, దేవ, కుమార్, రామన్, మధు, కర్ణాకర్, రాజేష్, రవి, అనూష తదితరులు పాల్గొన్నారు.



## స్ప్రింగ్ వాలీ గ్లోబల్ స్కూల్‌లో..

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ బాలాజీనగర్‌లోని స్ప్రింగ్ వాలీ గ్లోబల్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లో హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లులు బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. విద్యతో పాటు సాంస్కృతిక సంప్రదాయాలు, నైతిక విలువలను పెంపొందించడమే తమ పాఠశాల లక్ష్యమని యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మరియు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.





## సన్ షైన్ స్కూల్‌లో..

**జనగామ, మన చౌరాస్తా :** పట్టణంలోని సన్ షైన్ స్కూల్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా మినీ బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు, ఆటలతో పాఠశాల ప్రాంగణాన్ని సందడిగా మార్చేశారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి పట్ల ప్రేమ మరియు ఐకమత్యం వంటి విలువలను తెలియజేయడానికే ఈ వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ఎం.డి. అన్వర్, నవీన్, మనోజ్ తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







## నారాయణ హై స్కూల్‌లో..

**జనగామ, మన చౌరాస్తా :** పట్టణంలోని నారాయణ హై స్కూల్ (ENCS)లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ముందస్తు బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణాన్ని సందడిగా మార్చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఫర్హానా, డీజీఎం రిజ్వానా మాట్లాడుతూ.. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు ప్రకృతి ప్రాముఖ్యతను తెలియజేయడానికే ఈ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ విక్రమ్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**